క్లుప్తంగా

సీఈసీ సభ్యురాలు అనురాధకు సత్కారం



సీఈసీ సభ్యులు, మాజీ ఎంపీ అనురాధకు శుభాకాంక్షలు తెలుపుతున్న చెల్లుబోయిన శ్రీను తదితరులు

అల్లవరం: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఎంపికైన మాజీ ఎంపీ చింతా అనురాధను ముమ్మిడివరం, మండపేట నియోజకవర్గాల పరిశీలకులు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు మొగళ్లమూరులోని ఆమె నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనురాధకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కౌన్సిలర్లు దొమ్మేటి రాము, మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, ఎస్సీసెల్ కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, అమలాపురం మండల పార్టీ రూరల్ అధ్యక్షులు గుత్తుల చిరంజీవి, పాటి శ్రీరామ్, చెల్లుబోయిన నాని, కేతా భానుతేజ, ముషిని రాఘవేంద్ర, కట్టా బుజ్జి, దొమ్మేటి శేఖర్ తదితరులు అనురాధకు శుభాకాంక్షలు తెలిపారు.

సుబ్బు నియామకంపై హర్షం



ఏడిది సుబ్బు

కాట్రేనికోన: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, కందికుప్ప పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఏడిది సుబ్బారావు (సుబ్బు)ను రాష్ట్ర ఆర్టీఐ జాయింట్ సెక్రటరీగా పార్టీ కేంద్ర కార్యాలయం నియమించడంపై కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసారు. సుబ్బుకు రాష్ట్రస్థాయి బాధ్యతలు కల్పిస్తూ ఆర్టీఐ జాయింట్ సెక్రటరీగా నియమించడంపై పలువురు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం సేవలు అందిస్తున్న తనకు గుర్తింపుగా అదనపు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కు సుబ్బు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ నేల కిషోర్ కుమార్, పార్టీ శ్రేణులు నల్లా నరసింహమూర్తి, నాతి సత్యనారాయణ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు శాయ్ క్రీడాకారులు



జాతీయస్థాయి పోటీలకు హాజరైన యానాం శాయ్ క్రీడాకారులు

యానాం: మధ్యప్రదేశ్ ఇండోర్‌లో ఐడీఏ స్విమ్మింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 7 వరకు నిర్వహించే 14వ ఆధునిక పెంటాథ్లాన్ నేషనల్ చాంపియన్‌షిప్–2025 పోటీలకు యానాం నుంచి శాయ్ (స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా) అకాడమీ క్రీడాకారులు హాజరయ్యారని ఆదివారం ఇన్‌చార్జి ఎన్.ఉదయ్‌కుమార్, కోచ్ గ్రంధి రవితేజ తెలిపారు. అండర్–15నుంచి వీసం వెంకట నాగసాయి, అండర్–13లో వడ్డిడ జ్ఞాన్ అఖిలేష్, బైథెల్ పోటీలకు కోలాటి సతీష్‌కుమార్, టెంక ప్రేమ్‌కుమార్, బోయ పురందేశ్వరరాజులు, మణికంఠ నవీన్ వరద, వి.వెంకటనాగసాయి, ఎం.హేమచంద్ర, వీసం ప్రేగ్నాహర్షిత, సబ్బతి హేమవర్షిణి, నల్ల భావిజ్ఞ శ్రీప్రణవిక, సబ్బతి మృద్వికా వర్షిణి పాల్గొంటున్నారని తెలిపారు. ఇప్పటికే వీరంతా మధ్యప్రదేశ్‌కు చేరుకున్నారు.

వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి



పి.మల్లవరం చెక్‌పోస్టు వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సత్యనారాయణ

తాళ్లరేవు: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ హెచ్చరించారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కాకినాడ–యానాం జాతీయ రహదారిలో పి.మల్లవరం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించి, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు ద్విచక్ర వాహనదారులకు ఈ చలానా ద్వారా జరిమానాలు విధించారు. వాహనదారులకు తప్పనిసరిగా ఆయా వాహనాలకు సంబంధించి పూర్తి రికార్డు ఉండాలని, లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అన్నప్రసాద పథకానికి విరాళం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ– గోపాలస్వామి వారి ఆలయం అన్నప్రసాద పథకానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. దానిలో భాగంగా ఆదివారం హైదరాబాద్‌కు చెందిన పఠెం హేమచంద్ర వెంకట శ్రీసత్యశశాంక్– స్నిగ్ధశ్రీ రూ.25,116 విరాళంగా సమర్పించారు. దాతలకు దేవస్థానం తరఫున అధికారులు, వేద పండితులచే ఆశీర్వచనం అందించి, స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి, చిత్రపటాలను అందజేశారు.

ఊరించి..కాదని పింఛన్..!

- కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నరైనా తెరుచుకోని వెబ్‌సైట్
- సచివాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణ



తాళ్లరేవు మండలం పటవల గ్రామ సచివాలయం

ముమ్మిడివరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా కొత్త పింఛన్లకు మోక్షం లభించడం లేదు. వృద్ధాప్య, వితంతు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు రోజూ ఆయా గ్రామాల సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వడం లేదని అధికారులు తేల్చేయడంతో ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. పైగా ఉన్న పింఛన్లు తొలగించే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమైంది. వైఎస్సార్ సీపీ పాలనలో పింఛన్లు, రేషన్‌కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తే కూటమి ప్రభుత్వం దీనికి భిన్నంగా వ్యవహరిస్తోందని అర్హులు వాపోతున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన వెబ్‌సైట్

2024 ఏప్రిల్ 18 నుంచి సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో ఆగిన పింఛన్ల వెబ్‌సైట్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలైనా ఇంకా ఓపెన్ చేయక పోవడంపై ప్రజలు సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. పింఛన్ల కోసం 60 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఎదురుచూస్తున్నారు. అప్పటి వరకు నియోజకవర్గంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో అన్ని రకాల పింఛన్ల లబ్ధిదారులు సుమారు 16 వేల మంది వరకు ఉంటారని అంచనా ఉంది.

50 ఏళ్లకే పింఛన్ ఏదీ?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ టీడీపీ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా కూటమి నాయకులు ఆ హామీ ఊసెత్తడం లేదు. వృద్ధాప్య పింఛన్ తీసుకునే భర్త చనిపోతే అతని భార్యకు పింఛన్ ఇస్తామని ప్రకటించి ఆరకొరగా కొద్ది మందికే గత నెలలో పింఛన్లు మంజూరు చేశారంటూ అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ వెబ్ సైట్ తెరుచుకోలేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులను ప్రశ్నిస్తే తమపై కక్షకట్టి ఎక్కడ పింఛన్ మంజూరు చేయరనే అనుమానంతో వారిని ఎవరూ ప్రశ్నించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులకు నూతన పింఛన్లను మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఎప్పుడిస్తారో ఏమో!



బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వెళితే ఇంకా వెబ్‌సైట్ తెరుచుకోలేదని సిబ్బంది చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొత్త పింఛన్ కోసం సంబంధించి సమాచారం రాలేదని అధికారులు చెబుతున్నారు. కూటమి పాలకులు కొత్త పింఛన్ ఎప్పుడిస్తారో ఏమో!

– వందిరిపల్లి రాజేష్, నీలపల్లి,తాళ్లరేవు మండలం

నిరంతర ప్రక్రియగా కొనసాగాలి



పేదలకు ఎంతో ఉపయోగపడే పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కూటమి ప్రభుత్వం ఇంత వరకు సైట్ ఓపెన్ చేయకపోవడంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. అర్హతే ప్రమాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గంటి ఆకాష్, వైఎస్సార్ సీపీ మండల విద్యార్థి విభాగం

వైఎస్సార్ సీపీ ఎస్ఈసీ సభ్యుడు కుడుపూడికి సత్కారం



వైఎస్సార్ సీపీ నాయకుడు భరత్ భూషణ్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కుడుపూడి భరత్ భూషణ్ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్‌గా నియమితులైన సందర్భంగా ఆయనను పార్టీ నాయకులు స్థానిక సూర్యనగర్‌లో ఆదివారం అభినందించి సత్కరించారు. గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్, పార్టీ నాయకుడు కుంచే వెంకటరమణారావు, పార్టీ నాయకులు తోట శ్రీను, కుడుపూడి శాంతి భూషణం, సాధనాల శ్రీను, సరెళ్ల రామకృష్ణ, పెట్టా అప్పారావు తదితరులు వేర్వేరుగా ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు దేవరపల్లి నరేష్, ఎఎస్ కుమార్, నేరేడుమిల్లి శ్రీను, పందిరి సుబ్బరాజు, గంటా ప్రసాద్ పాల్గొని భరత్ భూషణ్‌ను అభినందించారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా సత్యకుమార్



అమలాపురం టౌన్: వేంకటేశ్వరస్వామి దేవస్థానం కొత్త ఈవోగా పీవీవీ సత్యకుమార్ నియమితులయ్యారు. పలు దేవాలయాల్లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన సత్యకుమార్ గ్రేడ్–1 ఈవోగా పదోన్నతి పొంది తొలిసారిగా అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన కాకినాడ అన్నదానం సమాజం సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ అమలాపురానికి పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈయన గతంలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా పనిచేసిన యర్రా వెంకటేశ్వరరావు రిలీవ్ కానున్నారు. తాళ్లరేవు గ్రూపు దేవాలయాల ఈవోగా పనిచేస్తూ ఈయన అదనపు బాధ్యతలతో అమలాపురం ఈవోగా సేవలందించారు. ఇప్పుడు రెగ్యులర్ ఈవో రావడంతో వెంకటేశ్వరరావు తాళ్లరేవు గ్రూపు దేవాలయాల ఈవోగా విధులు నిర్వర్తించనున్నారు. కొత్త ఈవోగా సత్యకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

తపాలా వారోత్సవాలను విజయవంతం చేయండి

అమలాపురం టౌన్: ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకూ డివిజన్‌లో తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అమలాపురం పోస్టల్ డివిజన్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. ఈ వారోత్సవాలను పోస్ట్ ఫర్ పీపుల్ లోకల్ సర్వీస్... గ్లోబల్ రీచ్ అనే థీమ్‌తో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వారోత్సవాలు తొలి రోజు (6వ తేదీ) టెక్నాలజీ దినోత్సవం పేరుతో సిబ్బందికి వర్క్ షాపులు నిర్వహిస్తారమన్నారు. డివిజన్ పరిధిలోని పోస్టల్ ఉద్యోగులకు క్విజ్ పోటీలు, 7న ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ డే పేరుతో డాక్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ ప్రోగ్రాం (డీసీడీపీ) నిర్వహించి నూతన సేవింగ్స్ ఖాతాలను ప్రారంభిస్తామన్నారు.8న ఫిలాటెలీ, సిటిజన్ సెంట్రిక్ సర్వీస్ దినోత్సవం పేరుతో విద్యార్థులకు, ఖాతాదారులకు స్టాంపుల సేకరణపై అవగాహన కలిస్తామన్నారు. 9న నేషనల్ పోస్టల్ వీక్ –2025 బ్యానర్లను ప్రదర్శన, ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. 10వ తేదీన కస్టమర్ దినోత్సవం సందర్భంగా కొత్త పాలసీల సేకరణ, తపాలా సేవింగ్స్, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సేవలపై ఖాతాదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. డివిజన్‌లోని ప్రధాన తపాల కార్యాలయాలు, పోస్ట్ ఆఫీసులు, సబ్ పోస్ట్ ఆఫీసుల ద్వారా వారోత్సవాల నిర్వహణకు సూపరింటెండెంట్ శేషారావు స్థానిక ప్రధాన తపాలా కార్యాలంలో సన్నాహాక సమావేశం శనివారం నిర్వహించి చర్చించారు. అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం, పోస్ట్ మాస్టర్లు పాల్గొన్నారు.

ఏడుకొండలు మృతికి సంతాపం



ఏడుకొండలు భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న నాయకులు

తాళ్లరేవు: దళిత ఉద్యమనేత, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు ఆకస్మిక మృతికి పలువురు ప్రగాఢ సంతాపం తెలియజేసారు. సుంకరపాలెం పంచాయతీ బాబానగర్‌లోని ఏడుకొండలు స్వగృహం వద్ద ఆయన భౌతికకాయానికి విశ్వజన కళామండలి వ్యవస్థాపకుడు మాస్టర్‌జీ, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, సుంకరపాలెం సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కన్నీడి వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్, నాయకులు దడాల జగదీశ్వర రావు, మోపూరి వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏడుకొండలు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

అగ్నికుల క్షత్రియ భవనానికి శంకుస్థాపన



సభలో మాట్లాడుతున్న పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు

అమలాపురం టౌన్: స్థానిక సూర్యనగర్‌లో రూ. 2 కోట్లతో నిర్మించ తలపెట్టిన అగ్నికుల క్షత్రియ కమ్యూనిటీ భవనానికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, పుదుచ్చేరి రాష్ట్ర మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తదితరులు అగ్ని కుల క్షత్రియ భవన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్ని కుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు లంకే భీమరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబుతోపాటు అగ్నికుల క్షత్రియ సంఘం ప్రతినిధులు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధుల నుంచి ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు.

తొలుత కార్యక్రమానికి సంబంధించి ముద్రించిన భారీ ఫ్లెక్సీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలు లేవని కూటమి పార్టీల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ అసంతృప్తి తెలిపారు. ఈ విషయమై అక్కడ కొద్దిసేపు గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. చివరకు అగ్నికుల క్షత్రియ సంఘీయులు ఆ ముగ్గురి నేతల ఫొటోలు ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో వివాదానికి తెరపడింది.

ఉన్నత లక్ష్యాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలి



విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న తులసీ రామచంద్ర ప్రభు, కాత్వా ప్రతినిధులు

అమలాపురం రూరల్: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి కోసం నిరంతరం కృషి చేయడం ద్వారా అత్యుత్తమైన సమాజాన్ని తద్వారా శక్తివంతమైన దేశాన్ని నిర్మించగలమని తులసి సీడ్స్ అధినేత తులసీ రామచంద్ర ప్రభు ఉద్బోధించారు. అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో ఆదివారం కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపకార వేతన పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా విద్యార్థులకు రూ.22 కోట్లు ఉపకార వేతనాలను పంపిణీ చేశామని తెలిపారు. కోనసీమ జిల్లాలో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, వైద్య విద్యలో ప్రతిభ కనపరిచిన 650 మంది విద్యార్థులకు ఆయన ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. గతేడాది 10వ తరగతిలో పరీక్షల్లో 596 మార్కులు సాధించిన పెద్దిరెడ్డి మోహనకృష్ణ సాత్విక్‌కు హైదరాబాద్ ఆలివ్ స్వీట్స్ అధినేత ఆలివ్ దొర రాజు రూ. లక్ష నగదు పురస్కారాన్ని అందించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందం మాట్లాడుతూ చిన్నారులు ఉన్నత విద్యనభ్యసించి సమాజానికి అద్భుతమైన వనరులుగా తయారు కావాలన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ రూ.50 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేసిన కాత్వా సభ్యులను అభినందించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, బండిగుప్తాపు పాండురంగ తదితరులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిట్నీడి నిరంజన్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు తాడి నరసింహారావు, రవణం స్వామినాయుడు, ఆకుల రామకృష్ణ, కాత్వా వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లా నారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిక్కం మైనర్ బాబు, కోనసీమ అధ్యక్షుడు మేడిచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నందెపు శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి గంద్రోతు నాగేశ్వరరావు, దంగడమే శ్రీనివాస రావు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అమలాపురం రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురంలో నిర్వహించిన వైద్య శిబిరంలో హైదరాబాదు ఏవీఎస్ హాస్పిటల్ సిబ్బంది వెరికోస్ వెయిన్స్ దశలు– చికిత్స విధానాలను ప్రజలకు వివరించారు. వేద నాచురల్స్ ఆళ్లగడ్డ పంచగవ్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు సూదా గణపతి ప్రారంభించారు.ఈ శిబిరంలో వంద మందికి వైద్య పరీక్షలు చేసి తగు సూచనలందించారు. మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్, సంతానలేమి, చర్మవ్యాధులు తదితర పలు రకాల వ్యాధుల నివారణకు ప్రాచీన సంప్రదాయ, భారతీయ వైద్య విధానాన్ని వివరించారు. ఈ శిబిరంలో ఏవీఎస్ హాస్పిటల్స్ డాక్టర్ బి.లావణ్య, కౌన్సిలర్ పి. భాను శ్రీ, శ్రీనివాస్, వేద నేచురల్స్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వి. నరేంద్రదేవ్, లయన్స్ క్లబ్ కార్యదర్శి బెహరా వీర హనుమంత రావు, అనిల్ కుమార్, రవణం వేణుగోపాల్ రావు, చిక్కాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా అమ్మవారి జాతర

కాట్రేనికోన: పల్లంకుర్రు పంచాయతీ పోర గ్రామంలో ఆదివారం అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. కాట్రేనికోన ఎస్సై అవినాష్ ఆధ్వర్యంలో పోలీసులు జాతర మహోత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. మండలంలో సమస్యాత్మక అగ్రికుల క్షత్రియ గ్రామాల్లో ఒకటైన పోరలో జాతర మహోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ జాతరకు బంధువులు, స్నేహితులు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో గ్రామంలో సందడి నెలకొంది. పోర గ్రామ దేవతలు కాసులమ్మ, దుర్గమ్మకు భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

దంత సమస్యలకు అత్యాధునిక చికిత్స



కేక్ కట్ చేస్తున్న వైద్యులు సజన్ ఆనంద్, సత్యం ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యం

సాక్షి, అమలాపురం: ఆయుష్ ఆసుపత్రి 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 3 నుంచి 15వ తేదీ వరకు ఉచిత దంత వైద్య పరీక్షలు, ఓపీ, డెంటల్ ఎక్సరే తదితర ట్రీట్‌మెంట్లపై 30 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు ఆస్పత్రి మేనేజర్ శ్యామ్ తెలిపారు. ట్రీట్‌మెంట్ చేయించుకున్న వారికి ఉచితంగా పళ్లను శుభ్రం చేస్తామన్నారు. ఆసుపత్రి డాక్టర్ సజన్ ఆనంద్ మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో ఇంప్లాంట్స్ పద్ధతి ద్వారా ఫిక్స్‌డ్ పళ్లు కట్టుట, ప్రమాదంలో విరిగిన దవడ ఎముకను సర్జరీతో సరి చేయడం వంటి వైద్య సేవలు అందుబాటు ధరలో అందిస్తామని అన్నారు. 9వ వార్షికోత్సవం సందర్భంగా సత్యం ఫౌండేషన్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం కేక్ కటింగ్ చేసి వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి చినబాబు, విజయానంద్ , వైద్యులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలు అదరహో

- అలరించిన అమలాపురం శ్రీదేవి దసరా భారీ ఊరేగింపు
- 150 మంది కళాకారులతో ప్రదర్శనలు



భూత, బేతాళ, శక్తి వేషాల ప్రదర్శన

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో దసరా శరన్నవ రాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలో ఆదివారం నిర్వహించిన అమ్మవారి నిమజ్జన ఊరేగింపును పుర వీధుల్లో వైభవంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పది రకాల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలకు విశేషంగా ఆకట్టుకున్నాయి. దాదాపు 150 మంది కళాకారులు ఈ సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్నారు. అన్ని ప్రదర్శనలు అదరహో రీతిలో సాగాయి. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన 40 మంది కళాకారులతో భూత, బేతాళ సెట్ ప్రదర్శన ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ గిరిజన కొమ్ము, కోయ బృందం (థింసా నృత్యం), విజయవాడకు చెందిన 13 మంది కళాకారులతో కాళి నృత్య ప్రదర్శన, గరగ నృత్యాలు, బుట్ట బొమ్మలు, కర్ర బొమ్మలు, కోతి డ్యాన్స్, 20 మంది కళాకారులతో జానపద డప్పుల నృత్యం, సినీ మ్యూజికల్ బ్యాండ్‌లు, వాహన ఫ్లవర్ డెకరేషన్ ఈవెంట్ ఇలా పలు ప్రదర్శనలు ప్రజల్లో వినోదాన్ని నింపుతూ ఊరేగింపు సాగింది. ముఖ్యంగా నరసింహావతారంతో రాక్షసుడిని సంహరిస్తున్న ప్రదర్శన చూపరులను గగుర్పాటుకు గురిచేసింది. యువత కేరింతల మధ్య భారీ ఊరేగింపు ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు, కమిటీ ప్రతినిధులైన మాజీ కౌన్సిలర్లు ఆశెట్టి ఆదిబాబు, మామిడిపల్లి రాంబాబు, జీవి తదితరులు పర్యవేక్షించారు. తొలుత శ్రీదేవి అమ్మ ఆలయం వద్ద నుంచి మొదలైన ఊరేగింపు ముస్లిం వీధి, హైస్కూలు రోడ్డు సెంటరు, గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు, అశోక్‌నగర్ తదితర వీధుల్లో సాగింది. ఆదివారం సాయంత్రం నుంచి మొదలైన ఊరేగింపు సోమవారం తెల్లవారు జాము వరకూ నిర్విరామంగా సాగింది.



డప్పులతో జానపద నృత్యం



నరసింహావతారంతో రాక్షస సంహారం



గిరిజన థింసా నృత్య ప్రదర్శన

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం సత్యనారాయణ

మామిడికుదురు: ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని అడిషనల్ డీపీఎం సత్యనారాయణ తెలిపారు. ఆయన ఈదరాడలో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పంటలను ఆదివారం పరిశీలించారు. పంచగవ్య స్ప్రేయింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో 25 లీటర్ల పంచగవ్య స్ప్రేయింగ్ చేయాలన్నారు. దీని వల్ల గింజ గట్టిపడ్డి దిగుబడి గణనీయంగా పెరుగుతుందన్నారు. దీని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. రైతులు ప్రకృతి సాగు విధానంలో పంటలు పండించాలన్నారు. కార్యక్రమంలో రైతులు యెరుబండి లక్ష్మయ్య, యెరుబండి ఫణిరామ్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ తదితరులు పాల్గొన్నారు.